అక్షర దర్బార్ voice of the people

విలేకరులు కావలెను

'అక్షర దర్బార్' దినపత్రికలో పనిచేసేందుకు ఉమ్మడి జిల్లాలోని
జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ, మండల స్థాయి,
వరంగల్, హనుమకొండ, క్రైం విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్న వారు కింద ఉన్న మెయిల్, వాట్సాప్ కు దరఖాస్తు పంపగలరు.

9581856444 ceo@aksharadarbar.com

www.aksharadarbar.com బుధవారం 28, ఫిబ్రవరి 2024

అక్షర దర్బార్

voice of the people

తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :27 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ గా నియామకమైన ప్రజాపక్షం ఎడిటర్ శ్రీనివాస్ రెడ్డి సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ డెలివరీలో సరికొత్త వ్యవహారం

షిఫ్టింగ్ దందా..

- గడువులోగా ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయని మిల్లర్లు
- సర్కార్ కేటాయించిన ధాన్యం మార్కెట్ కు తరలింపు
- గడువు ముగిసే సమయంలో షిఫ్టింగ్ ప్లాన్
- కాగితాలపైనే ధాన్యం బదిలీ
- సహకరిస్తున్న సివిల్ సప్లై అధికారులు
- పెద్ద మొత్తంలో చేతులు మారుతున్న డబ్బు

02

రైస్ మిల్లర్లు సరికొత్త దందాకు తెరతీశారు. నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయకుండా షిఫ్టింగ్ విధానం అవలంభిస్తున్నారు. కేవలం కాగితాలపైనే జరుగుతున్న ఈ వ్యవహారానికి సివిల్ సప్లై అధికారులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధానంపై రైస్ మిల్లర్లకు కేటాయిస్తుంది. దీన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ ను డెలివరీ చేయడానికి రైస్ మిల్లర్లకు గడువు పెడుతుంది. అయితే ఈ ధాన్యం పొందిన మిల్లర్లు కొందరు తమకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని మార్కెట్ కు తరలించి అమ్ముకుంటున్నారు. దీంతో నిర్దేశిత గడువులోపు ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయడం లేదు. ఫలితంగా సీఎంఆర్ డెలివరీ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రభుత్వం గడువు పొడిగిస్తున్నప్పటికీ సదరు రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన సివిల్ సప్లై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పౌరసరఫరాలశాఖ, పౌరసరాల సంస్థ అధికారులు, మిల్లర్లు ఒక అవగాహనకు వచ్చి సరికొత్త దందాకు పాల్పడుతున్నారు. మిల్లు రిపేరు ఉంది, లేదా మిల్లు పనిచేయడం లేదనే వివిధ సాకులతో ధాన్యం షిఫ్టింగ్ పేరుతో కొత్త నాటకమాడుతున్నారు. **- అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి**

4, 5వతేదీన ప్రధాని మోదీ పర్యటన

రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఖరారైంది. మార్చి 4, 5వ తేదీల్లో ప్రధాని పర్యటించనున్నారు. 4న ఆదిలాబాద్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, బహిరంగసభలో పాల్గొంటారు. రాత్రి హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో బస చేస్తారు. 5వ తేదీన సంగారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

బండి యాత్రపై కోడిగుడ్లతో దాడికి యత్నం

- కాంగ్రెస్ నాయకులు రెచ్చగొడుతున్నారు
- బీజేపీ కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నేతలు తిరుగలేరు
- బీజేపీ నేత బండి సంజయ్ ఫైర్

02

అలా మాట్లాడితే..

సజీవ దహనానికి సిద్ధం!

- మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు
- రాముడు, అక్షింతల గురించి మాట్లాడలేదని వీడియో సందేశం
- రాముడితో రాజకీయాలు చేస్తావా? అంటూ బండిపై ఫైర్

02

40 మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

- ములుగు అడిషనల్ కలెక్టర్ గా మహేందర్ జీ
- పలువురు ఆర్డీవోలు బదిలీ

04

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల అరగంట ముందే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తొలిరోజు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

షిఫ్టింగ్ దందా..!

- సీఎంఆర్ డెలివరీలో సరికొత్త వ్యవహారం
- గడువులోగా ప్రభుత్వానికి డెలివరీ చేయని మిల్లర్లు
- సర్కార్ కేటాయించిన ధాన్యం మార్కెటుకు తరలింపు
- గడువు ముగిసే సమయంలో షిఫ్టింగ్ ప్లాన్
- కాగితాలపైనే ధాన్యం బదిలీ
- సహకరిస్తున్న సివిల్ సప్లై అధికారులు
- పెద్ద మొత్తంలో చేతులు మారుతున్న డబ్బు

అక్షర దర్బార్, వరంగల్ ప్రధాన ప్రతినిధి :

రైస్ మిల్లర్లు సరికొత్త దందాకు తెరతీశారు. నిర్దేశిత గడువు లోగా ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయకుండా షిఫ్టింగ్ విధానం అవలంభిస్తున్నారు. కేవలం కాగితాలపైనే జరుగు తున్న ఈ వ్యవహారానికి సివిల్ సప్లై అధికారులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధానంపై రైస్ మిల్లర్లకు కేటా యిస్తుంది. దీన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ ను డెలివరీ చేయ డానికి రైస్ మిల్లర్లకు గడువు పెడుతుంది. అయితే ఈ ధాన్యం పొందిన మిల్లర్లు కొందరు తమకు ప్రభుత్వం కేటా యించిన ధాన్యాన్ని మార్కెటుకు తరలించి అమ్ముకుంటు న్నారు. దీంతో నిర్దేశిత గడువులోగా ప్రభుత్వానికి సీఎంఆర్ డెలివరీ చేయడం లేదు. ఫలితంగా సీఎంఆర్ డెలివరీ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ప్రభుత్వం గడువు పొడిగిస్తున్నప్పటికీ సదరు రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ మిల్లర్లపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిన సివిల్ సప్లై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ అధికారులు, మిల్లర్లు ఒక అవ గాహనకు వచ్చి సరికొత్త దందాకు పాల్పడుతున్నారు. మిల్లు రిపేరు ఉంది, లేదా మిల్లు పనిచేయడం లేదనే సాకు లతో ధాన్యం షిఫ్టింగ్ పేరుతో కొత్త నాటకమాడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ప్రభుత్వం ఏటా రైస్ మిల్లర్లకు సీఎంఆర్ కోసం ధాన్యం ఇస్తున్నది. నిర్దిష్ట గడువు విధించి ఈ లోపు ధాన్యం నూర్పిడీ చేయాలని మిల్లర్లకు ఆదేశిస్తుంది. ఒకవేళ గడువు లోగా.. ధాన్యం నూర్పిడీ చేయకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. అసలు నాటకం తెలిస్తే ప్రజలు నివ్వెర పోవాల్సిందే. ధాన్యం మిల్లుకు వచ్చిన తర్వాత కొందరు మిల్లర్లు ఏం చేస్తారంటే.. ధాన్యాన్ని అనుకున్నట్టుగానే మార్కెట్ కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం మిల్లుకు కేటాయించిన ధాన్యం మిల్లులో ఉందా, లేదా, నూర్పిడి జరుగుతుందా అనేది ఆరా తీయాల్సిన అధి కారులు ముడుపులు తీసుకుని మిల్లర్ల దందాకు సహకారం అందిస్తున్నారు.

కాగితాలపైనే ధాన్యం బదిలీ..

ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసినందుకు డబ్బులు చెల్లిస్తుంది. అయితే గడువులోగా సీఎంఆర్ డెలివరీ చేయాల్సిన మిల్లర్లు ఇక్కడ అలా చేయడం లేదు. ఖరీఫ్ లో కేటాయించిన ధాన్యం ఖరీఫ్ గడువు, రబీలో ఇచ్చిన ధాన్యం రబీ గడువులోనే సీఎంఆర్ డెలివరీ చేయాలి. కానీ రైస్ మిల్లర్లు కొందరు గడువు ముగిసినా సీఎంఆర్ డెలివరీ చేస్తలేరు. సీఎంఆర్ 100 శాతం డెలివరీ చేయకపోతే ప్రభుత్వం చట్టపరమైన చర్యలకు ఉపక్రమించవచ్చు. మిల్లు సీజ్ చేయవచ్చు. వచ్చే సీజన్ కు సంబంధించి ధాన్యం ఇవ్వదు. వెరసి మిల్లు మూతపడే అవకాశం ఉంటుంది. దీంతో ఇక్కడ లాజిక్ గా ఏం చేస్తున్నారంటే పౌరసరఫరాల శాఖ అధికారులు, పౌరసరఫరాల సంస్థ, మిల్లర్లు కలిసి సాకులు చూపుతూ సీఎంఆర్ డెలివరీ చేయాల్సిన ధాన్యం ఇతర మిల్లుకు షిఫ్టింగ్ చేసినట్లుగా కేవలం కాగితాలపై మార్చుతూ సరికొత్త వ్యవహారానికి తెరతీశారు. ఇది ఎవరికీ తెలియదు. అయితే, ఖరీఫ్ ధాన్యం సీఎంఆర్ డెలివరీ గడువు ముగిసేలోగా.. అప్పటికే తమకు ప్రభుత్వం కేటా యించిన రబీ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీ చేస్తున్నారు. ఈ విషయంలో మిల్లర్లకు సివిల్ సప్లై అధికారులు సహకరించడంతో మిల్లర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. 2022- 23 ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీకి సంబంధించి గత జనవరిలో వరంగల్ జిల్లాలో దాదాపు పది మిల్లుల్లో ఈ దందా యథేచ్ఛగా జరిగినట్లు తెలిసింది. హనుమకొండతో పాటు ఇతర జిల్లాల్లోని మరికొన్ని రైస్ మిల్లుల్లో కూడా ఇదే జరిగినట్లు సమాచారం. మిల్లుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి ధాన్యంపై పర్యవేక్షణ చేయాల్సి ఉండగా.. అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో మిల్లర్లు ఇలాంటి దందాలకు ఒడిగడుతున్నారు.

రబీ ధాన్యంతో ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీ...

ఉదాహరణకు 2022- 23లో ఖరీఫ్ లో ప్రభుత్వం కేటా యించిన ధాన్యాన్ని నూర్పిడి చేసి రైస్ మిల్లర్లు ఈనెల 29 లోగా సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉంది. సర్కారు తమకు ఇచ్చిన ధాన్యంలో కొంత మార్కెట్ లో అమ్ముకున్న మిల్లర్లు కొందరు సీఎంఆర్ డెలివరీ చేయడానికి తమ వద్ద ధాన్యం లేకపోవడంతో రబీ ధాన్యం కలిగి ఉన్న మరో రైస్ మిల్లర్ ను సంప్రదించి షిఫ్టింగ్ విధానానికి ప్లాన్ చేస్తున్నారు. తాము డెలివరీ చేయాల్సిన ఖరీఫ్ సీఎంఆర్ ధాన్యాన్ని సదరు మిల్లర్ కు బదిలీ చేసినట్లు కేవలం కాగితాలపైనే చూపుతూ చర్యల నుంచి తప్పించుకుంటున్నారు. ఈ బాధ్యత తీసుకుంటున్న మరో రైస్ మిల్లర్ తాను రబీ సీఎంఆర్ డెలివరీ చేయాల్సిన గడువు ముగిసేలోగా ఇంకో రైస్ మిల్లర్ కు ధాన్యం షిఫ్ట్ చేసినట్లు మళ్లీ కాగితాలపైనే చూపుతూ తమ దందాను కొనసాగిస్తున్నారు. ఇదంతా ఆ యా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అనుమతితో జరుగుతుండటం గమ నార్హం. మిల్లులో ధాన్యం లేకపోయినా కాగితాలపై సాగుతు న్నాయి. ఈ వ్యవహారానికి అధికారులు సహకరిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తే మిల్లర్లు, అధికారులు కలిసి సాగిస్తున్న షిఫ్టింగ్ దందా బయటపడనుంది.

మా సహనాన్ని పరీక్షించొద్దు..

- మేం తలుచుకుంటే గ్రామాల్లో తిరగలేరు
- కరీంనగర్ ఎంపీ, బీజేపీ నేత బండి సంజయ్
- ప్రజాహిత యాత్రలో కోడిగుడ్ల దాడిపై సీరియస్

భీమదేవరపల్లి : శాంతియుతంగా ప్రజాహిత యాత్ర చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు రెచ్చగొడుతున్నారని, బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు గ్రామాల్లో తిరగలేరని కరీంనగర్ ఎంపీ, బీజేపీ నేత బండి సంజయ్ ఫైర్ అయ్యారు. బీజేపీ నేత బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోకి చేరుకోగానే కాంగ్రెస్ నాయకులు కాన్వాయ్పై కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో బీజేపీ కార్యకర్తలు అప్రమత్తం కావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు పరారీ అయ్యారు. ఈ దాడిపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మా సహనాన్ని చేతగానితనంగా భావిం చొద్దని హెచ్చరించారు. నాపై దాడి చేస్తుంటే పోలీసులు చేష్టలుడిగి చూస్తున్నారని మండిపడ్డారు. కోడిగుడ్లతో దాడి చేస్తున్న వ్యక్తులను కనీసం నిలువరిం చకపోవడమేంటని నిలదీశారు. అట్లాంటప్పుడు మీ భద్రత నాకు అక్కర్లేదు... వెళ్లిపోండంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నా రక్షణ సంగతి మా కార్య

పోలీసులతో మాట్లాడుతున్న బండి సంజయ్

కర్తలే చూసుకుంటారని చెప్పారు. కాగా, తీవ్ర ఉద్రిక్తత మధ్య వంగరలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర కొనసాగింది.

పోలీసులు అలెర్ట్..

బండి సంజయ్ పై దాడి నేపథ్యంలో పోలీసులు అలెర్ట్ అయ్యారు. కాన్వాయ్పై కోడిగుడ్లు విసిరిన వ్యక్తిని అదు పులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్త గజ్జెల సురేష్ దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అయితే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకే కాంగ్రెస్ కార్యకర్తలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీజేపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు.

అలా మాట్లాడితే.. సజీవ దహనానికి సిద్ధం

- మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు
- రాముడు, అక్షింతల గురించి మాట్లాడలేదని వీడియో సందేశం
- రాముడితో రాజకీయాలు చేస్తావా? అంటూ బండిపై ఫైర్

అక్షర దర్బార్, కరీంనగర్ : తాను రాముడి జన్మస్థలం గురించి మాట్లాడలేదని, అలా మాట్లాడి ఉంటే, సజీవ దహ నానికి సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు బుధవారం ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తన తల్లిని అవమానపర్చేలా మాట్లాడారని, రాజకీయాలతో ఆమెకు ఏమైనా సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. ఎంపీగా ఏం చేశావని అడిగితే, బతికి ఉన్న నా తల్లి ఆత్మ క్షోభిస్తుందని మాట్లాడుతావా? అని ఫైర్ అయ్యారు. రాముడిని ఆరాధిస్తున్నవ్యక్తి అయి ఉండి, రాముడిని రాజకీయాల్లోకి తెస్తవా? అనవసరంగా దేవుడిని వాడుకుంటున్నావా? నేను అక్షింతల గురించి మాట్లాడి ఉంటే, పత్రికలు వార్తలు రాస్తుండే కదా? ఇంత చౌకబారు, చిల్లర రాజకీయాలు చేస్తావా? అంటూ వీడియోలో మండిపడ్డారు. తాను వెజిటేరియన్ అని, హిందువు అని చెప్పారు. అదే బండి రోజూ మాంసం, మందు లేనిది బతకలేడని విమర్శించారు. ఇవాళ కూడా నా తల్లి తనను ఆశీర్వ దించి, రోజుకు నాలుగు సార్లు ఫోన్ చేసి బిడ్డా తిన్నావా? అని అడుగుతదని, అది

నా తల్లి గొప్పతనమని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఎంపీ ఓడిపోతే, రాజీనామా చేస్తానని చెబుతున్నావ్.. నీకు సిగ్గుందా?.. ఎమ్మెల్యేగా మూడుసార్లు ఓడిపోయినవ్.. ఎంపీ పదవికి రాజీనామా చేశావా? నేను నీ కంటే ముందే ఎంపీగా గెలిచిన. మార్క్ ఫెడ్ చైర్మన్, నా దయా దక్షిణ్యాల మీద కాంగ్రెస్ క్యాడర్ల అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అయ్యావ్.. నువ్వా నా గురించి మాట్లాడేది.. జాగ్రత్త'.. అంటూ హెచ్చ రించారు.

ఎన్నికల హామీలను నెరవేర్చుతాం..

కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు అన్నారు. బుధవారం శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. గత పాలకుల కంటే భిన్నంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

జెండావిష్కరణ చేస్తున్న హరిప్రసాద్

అక్షర దర్బార్, నెక్కొండ: నెక్కొండ మండల కేంద్రంలో బుధవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. మేరు సంఘం మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ గణేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ మేరు హాజరై కుట్టు మిషన్ సృష్టికర్త ఎలియాస్ హోవే చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ మేరు మాట్లాడుతూ మేరు కులస్తులు అనాదిగా కులవృత్తి ఐన కుట్టుపనిపై ఆధారపడి కడు పేదరికంలో జీవిస్తున్నారని, వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు సంఘ వెంకటేశ్వర్లు, పెండ్యాల శ్రీనివాస్, కీర్తి సురేష్, రామగిరి సతీష్, రామగిరి లక్ష్మయ్య, గట్ల వరుణ్, కీర్తి రామ్మోహన్, సంఘ రాజేష్, కొత్తకొండ ఓం చందర్, కొత్తకొండ సరళ, తదితరులు పాల్గొన్నారు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన మేడిపల్లి రాజ శ్రీనివాస్ (35) దివ్యాంగుడు. గ్రామంలో టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తు న్నాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా కుటుంబంలో గొడవ జరిగి అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో నుంచి వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం గ్రామ సమీపంలోని వాగు వద్ద రాజ శ్రీనివాస్ మృత దేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పెట్రోల్ పంపును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

అక్షర దర్బార్, ఏటూరునాగారం : మండలంలోని రామన్నగూడెంలో వెంకటేశ్వర ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్ ను కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్, కార్యదర్శి గుడ్ల దేవేందర్, యూత్ కార్యదర్శి ఎండీ గౌస్ పాషా, మాజీ వార్డుమెంబర్ పడిదాల హన్మంత్, చామర్తి కిషోర్, ముఖేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు..

విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకొని, ఆర్థిక క్రమశిక్షణ పాటించా లని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి తిరుపతి అన్నారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జం గేడు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన 15 మంది విద్యార్థులకు బహుమతులు అందజే శారు. ఈ సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి తిరుపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పొదుపు పథకాలపై, డిజిటల్ లావాదేవీలపై, సైబర్ నేరాల పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

సీపీని కలిసిన దుగ్గొండి సీఐ రాజగోపాల్

సీపీకి పూల మొక్కను ఇస్తున్న సీఐ

అక్షర దర్బార్, దుగ్గొండి : దుగ్గొండి రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రాజగోపాల్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ కు సీపీ శుభాకాంక్షలు తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన నాగుర్ల

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నాగూర్ల వెంకటేశ్వర్లు

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండల కేంద్రంలో తోర్నే అనిల్- కవితల కూతురు రేష్మ-ఓంకార్ వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనవెంట ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే శివాజీ, ఉపా ధ్యక్షులు కొల్లూరి కందేరావు, ముఖ్య సలహాదారులు పేర్వాల లింగమూర్తి, నడికూడ మండల అధ్యక్షుడు లోకిటి నగేశ్, సీనియర్ నాయకులు వాంకే రాజయ్య, మోకిడే రాజు, తోర్నే శ్రీకాంత్, రగుసాల తిరుపతి తదిత రులు ఉన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నూతన వధూవరులకు ఎమ్మెల్యే దొంతి ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, దుగ్గొండి : చెన్నారావుపేట మండలం చిన్నగురజాల గ్రామానికి చెందిన మిట్టపెల్లి చిన్నరామస్వామి కూతురు వెన్నెల-వి ఘ్నేష్ వివాహ వేడుక గిర్నిబావిలోని జీఆర్బీ ఫంక్షన్ హాల్లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నాగేశ్వర్ కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మహ్మద్ బాబా

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ మైనా ర్టీ సెల్ ప్రెసిడెంట్ గా మహమద్ బాబా నియమితులయ్యారు. ఈ మేరకు మహ్మద్ బాబాకు బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నర్సంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు వేముల సారంగం గౌడ్, కార్యదర్శి మోటం రవికు మార్ తదితరులు ఉన్నారు.

పట్టణ కార్యదర్శిగా నాడెం నాగేశ్వర్

నర్సంపేట పట్టణకాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా 8వ వార్డుకు చెందిన నాడెం నాగేశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

సూక్ష్మ దర్శినిని తయారు చేసిన లాస్య

మైక్రోస్కోపుతో లాస్య

అక్షర దర్బార్, హనుమకొండ: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని నయీంనగర్ తేజస్విని పాఠశాల విద్యార్థిని లాస్య సంయుక్త సూక్ష్మదర్శి నిని తయారు చేసింది. ఆరో తరగతి చదువుతున్న కూరపాటి లాస్య సొంత ఆలోచనలతో సంయుక్త సూక్ష్మ దర్శిని తయారు చేసి అందరిచే మన్ననలు పొందుతోంది. భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తను కావాలని, సమాజ శ్రేయస్సుకు తన వంతు పాత్ర పోషించా లని కోరుకుంటున్న లాస్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందిస్తు న్నారు. తండ్రి సత్య ప్రకాష్ రావు మార్గదర్శనం చేస్తున్నారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

రేవంత్ రెడ్డి..
నీ భాష మార్చుకో..

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- సీఎంగా నీ మాటతీరు జుగుప్సాకరం
- కేటీఆర్ పై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..
- కుటుంబ రాజకీయాలపై మాట్లాడడం సిగ్గు చేటు
- ఇందిరా గాంధీ పేరు చెప్పందే కాంగ్రెస్ నాయకులకు పూట గడవదు
- సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్

హనుమకొండ : చేవెళ్ళ సభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. హనుమకొండలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కడియం మాట్లాడుతూ కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి మాటలు జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు. ఒక ముఖ్యమంత్రిని అనే సోయి మరచి మాట్లాడుతున్నాడని, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయలేకనే ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నారని అన్నారు.మగాడివి అయితే ఒక్క ఎంపీ సీటు గెలువు అని ఒక ముఖ్యమంత్రి మాట్లాడటం సిగ్గుచేటని, మల్కాజిగిరి ఎంపీ గా ఉన్న నువ్వు 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక్క సిటు కూడా ఎందుకు గెలిపించుకోలేదని ప్రశ్నించారు. రాజకీయాలలో మగతనం గురించి మాట్లాడుతున్నావు..అంటే మీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీని, ప్రియాంక గాంధీని అవమానించినట్లేనా.. అని ప్రశ్నించారు. ఇదేనా నువ్వు నేర్చుకున్న సభ్యతా సంస్కారం అన్నారు. తెలంగాణలోని 17ఎంపీ స్థానాలను గెలుచుకొని నీ మగతనం ఏంటో నిరూపించుకో అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సీఎం కుర్చీ ఈనాం కింద రాలేదు, వారసత్వంగా రాలేదు అంటున్నాడని, కచ్చితంగా సీఎం కుర్చీ నీకు ఇనాం కిందనే వచ్చింది అని కడియం స్పష్టం చేశారు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సాహించింది కాంగ్రెస్ పార్టీ కాదా....? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబ రాజకీయాలపై మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారని, ఇప్పటికీ కూడా ఇందిరా గాంధీ పేరు చెప్పంది మీకు పూట గడవదని, కాంగ్రెస్ పేరుకే జాతీయ పార్టీ.... నిజానికి అది ప్రాంతీయ పార్టీ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమంత్రి గా కాకుండా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి గా వ్యవహరించాలని హితవు పలికారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని, కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదని, కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ లబ్ది కోసమే కాళేశ్వరాన్ని వాడుకుంటోందని దుయ్యబట్టారు. కాళేశ్వరంపై నిపుణుల కమిటీతో విచారణ జరిపి బాధ్యులపై చట్టారీత్య చర్యలు తీసుకోవాలని అన్నారు. మేడిగడ్డను రిపేర్ చేయకుండా మొత్తం కొట్టుకుపోవాలనే దుర్మార్గపు ఆలోచనలో ఉన్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు, నీచ రాజకీయాలు మానుకోవాలని, ముఖ్యమంత్రి భాషను సవరించుకొని జాగ్రత్తగా మాట్లాడటం నేర్చుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ , మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

40 మంది డిప్యూటీ కలెక్టర్లు
బదిలీ..

- ములుగు అడిషనల్ కలెక్టర్ గా మహేందర్ జీ
- పలువురు ఆర్డీవోలు బదిలీ

అక్షర దర్బార్, హనుమకొండ: ప్రభుత్వం మరోసారి రాష్ట్రంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను 40 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు బదిలీ అయ్యారు. హనుమకొండ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ)గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ)గా ఏ వెంకట్ రెడ్డి నియమితులయ్యారు. ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ అయ్యారు. వరంగల్, హనుమకొండ, జనగామ, స్టేషన్ ఘన్ పూర్, భూపాలపల్లి, పరకాల రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు వాసుచంద్ర, ఎల్ రమేష్, మురళీకృష్ణ, వి రామ్మూర్తి, రమాదేవి, శ్రీనివాస్ కూడా బదిలీ అయ్యారు. వాసుచంద్ర నారాయణపేట ఆర్డీవోగా, కే.రమాదేవి మెదక్ ఆర్డీవోగా, మురళీకృష్ణ జీఏడీలో నియమితులయ్యారు. ఎల్.రమేష్ సిరిసిల్ల ఆర్డీవో, కే.శ్రీనివాస్ కల్లూరు ఆర్డీవోగా బదిలీ అయ్యారు. వరంగల్ ఆర్డీవోగా స్రవంతి బ్రహ్మరౌతు, భూపాలపల్లి ఆర్డీవోగా ఎం.మంగీలాల్, జనగామ ఆర్డీవోగా డీ.కొమురయ్య, హనుమకొండ ఆర్డీవోగా ఎన్.వెంకటేష్, పరకాల ఆర్డీవోగా కె. నారాయణ, స్టేషన్ ఘన్ పూర్ ఆర్డీవోగా డీఎస్ వెంకన్న, ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (టీడబ్ల్యూ)గా వి. రామ్మూర్తి, భూపాలపల్లి భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా టి.వినోద్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

దొంగల ముఠా అరెస్టు

రూ.5.20 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సతీష్ బాబు

అక్షర దర్బార్, ఏనుమాముల : తాళాలు వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసే దొంగల ముఠాను వరంగల్ ఏనుమాముల పోలీసులు పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి రూ.5.20 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మామునూరు ఏసీపీ సతీష్ బాబు బుధవారం వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా ధవలేశ్వరానికి చెందిన రాపోలు రామకృష్ణ, భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన పప్పుల సంపత్, కేతరి కిరణ్ కలిసి వరంగల్ మండలంలోని ఆరేపల్లిలో బుర్రి వసంతరావు, పరకాలలోని అనంతుల ఉమామహేశ్వర్, పొన్నగంటి సుజిత్ కుమార్ ఇళ్లలో ఇటీవల చోరీలకు పాల్పడ్డారు. ఇండ్లకు వేసిన తాళాలను పగలగొట్టి ముఠా సభ్యులు దొంగతనానికి పాల్పడినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ.5.20 లక్షల విలువ చేసే నగదు, నగలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు సతీష్ బాబు వెల్లడించారు. ఏనుమాముల సీఐ పుల్యాల కిషన్, ఎస్సై శ్రీకాంత్, సీసీఎస్ ఎస్సై సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి
ఎల్వోసీ అందజేత..

అక్షర దర్బార్, మల్హర్ : ముత్తారం మండలం ఒడేడు గ్రామానికి చెందిన పొలవేని సతీష్ కుటుంబానికి మంత్రి శ్రీధర్ బాబు రూ.2.5 లక్షల ఎల్వోసీని బుధవారం అందజేశారు. సతీష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 2.5 లక్షల ఎల్వోసీని నిమ్స్ ఆసుపత్రిలో మంత్రి అందజేశారు.

దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

బల్దియాలో టాక్స్
సమస్యల పరిష్కార మేళా

అక్షర దర్బార్, వరంగల్ : జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో బుధవారం పన్నుల (రెవెన్యూ) సమస్యల పరిష్కార మేళా నిర్వహించారు. ఈ మేళాలో కాశీబుగ్గ సర్కిల్ పరిధికి నుంచి 5, కాజీపేట సర్కిల్ కు నుంచి 4 దరఖాస్తులు మొత్తం 9 దరఖాస్తులు స్వీకరించినట్లు జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. ప్రతి బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పన్నుల(టాక్స్) మేళా నిర్వహిస్తున్నామని, నూతన ఇంటి పన్ను, పన్ను సవరణ, యజమాని పేరు సవరణ, నెంబర్ సవరణ, ఖాళీ స్థలానికి పన్ను విధింపు, ఖాళీ స్థలం పన్ను నుంచి ఇంటి పన్ను మార్పు తదితర సమస్యలపై దరఖాస్తు సమర్పిస్తే పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనిల్, సీనియర్ అసిస్టెంట్ ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

భూపాలపల్లి జెడ్పీ సీఈవో విజయ లక్ష్మి

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జెడ్పీ సీఈవో విజయలక్ష్మి అన్నారు. భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేయు ప్రక్రియపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. దేశ భవిష్యతుకు, బలమైన ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు ముడిపడి ఉందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అర్హులంతా విధిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి అవినాష్, సెక్టోరల్ అధికారి కిషన్ రావు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో
చుక్కలు వేయించాలి

జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. జిల్లాలో మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో 34,728 మంది ఐదేళ్లోపు చిన్నారులను గుర్తించామని, మార్చి 3, 4, 5 తేదీల్లో వీరందరికి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 321 పోలియో కేంద్రాలు, 18 మొబైల్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు బస్టాండ్, జనసమూహ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీహెచ్ఐ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అన్వేషిని, పీవోఏం శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.